క్లుప్తంగా

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గత ఏడాది 18 మంది విద్యార్థులున్నప్పుడు ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రస్తుతం 40 మంది ఉంటే ఇద్దరే ఉండటం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల పాఠశాల నుంచి ఉపాధ్యాయుడు రమేశ్‌ను డిప్యూటేషన్‌పై అంతక్కపేట పాఠశాలకు పంపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అతడిని తిరిగి రప్పించాలని డిమాండ్ చేశారు. దీంతో డిప్యూటేషన్‌పై పంపిన ఉపాధ్యాయుడిని తిరిగి రప్పిస్తామని ఎంఈఓ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న విజయ్‌కుమార్

గజ్వేల్‌రూరల్: వివిధ కారణాలతో మృతి చెందిన నిరుపేదల కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్)కు చెందిన గూడురి కొండయ్య, కొండపాకకు చెందిన తంగొళ్ల ఎల్లయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకొని మృతుల కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. కొమ్ము మల్లేశం సహకారంతో కొండయ్య కుటుంబానికి రూ.10 వేలు, ఎల్లయ్య కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు రవిగౌడ్, బాల్‌నర్సు, మల్లయ్య, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



ఉపేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న రఘోత్తంరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థుల మనోవికాసానికి, పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. నర్మేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గాడిపల్లి ఉపేందర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పురస్కరించుకొని శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు ఉపేందర్‌రెడ్డి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి ప్రకటించగా ఎమ్మెల్సీ, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆ నగదు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల కృషి ఫలితంగా నర్మేట విద్యార్థులు ఏటా 10 జీపీఏ సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశిధరశర్మ, ఇంద్రసేనారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శనిగరం కనకయ్య, నోడల్ అధికారి ప్రభాకర్‌రావు, పాఠశాల కమిటీ చైర్మన్ చందన, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు ధ్వంసం



రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్

కోహెడరూరల్(హుస్నాబాద్): పొలం పనుల్లో అదనపు శ్రమ, ఖర్చు తగ్గుతుందని కొంతమంది ట్రాక్టర్ల యజమానులు, రైతుల స్వార్థానికి రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇష్టారీతిన రోడ్లపై కేజ్‌వీల్స్‌తో రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలోని విజయపల్లి గ్రామ శివారులో కొందరు ట్రాక్టర్ యజమానులు కేజ్‌వీల్స్‌తో పొలాలకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆట వస్తువులు ఇలా.. ఆడుకునేదెలా?



ధ్వంసమైన ఆట వస్తువులతోనే ఆడుకుంటున్న పిల్లలు



ఓపెన్ జిమ్‌లో కాలక్షేపం చేస్తున్న పిల్లలు, పెద్దలు

పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని మున్సిపల్ పార్క్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ పార్క్‌లో ఆడుకోవడానికి వందలాది మంది పిల్లలు వస్తుంటారు. పార్క్‌లో ఆటవస్తువులు పాడైపోయాయి. వాటర్ ఫౌంటెయిన్ పని చేయడంలేదు. దీంతో ఎన్నో రోజులు నీరు నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసంగా మారడమేకాకుండా దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి పిల్లల పార్క్‌ను బాగు చేయాలని కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



విరిగిన ఆటవస్తువు



రంగుమారిన ఫౌంటెయిన్‌లోని నీరు



కనిపించని ఊయ్యాలలు



ఇంకుడు గుంతలో ఆట వస్తువులు

రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలి

● అల్వాల గ్రామ అభివృద్ధి జేఏసీ



ఆందోళన చేస్తున్న అల్వాల గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల పట్టించుకోవడం లేదని మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, అల్వాల గ్రామ అభివృద్ధి కమిటీ జేఏసీ కన్వీనర్ అధ్యక్షుడు బాలకిష్టయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్వాల నుంచి తొగుట మండలం గుడికందుల వరకు చేపట్టిన బీటీ రోడ్డు మరమ్మతులు నిలిచి పోవడాన్ని నిరసిస్తూ శనివారం జేఏసీ ఆధ్వర్యంలో అల్వాల గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్వాల నుంచి గుడికందుల గ్రామం వరకు బీటీ రోడ్డు పది నెలల క్రితం మరమ్మతులు ప్రారంభించారన్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో మరమ్మతులు నిలిచి పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. గుంతల మయంగా మారిన రోడ్డులో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వారంలోగా పనులు పూర్తి చేయాలని లేకుంటే జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన అల్వాల నుంచి సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మండల కో ఆప్షన్ మెంబర్ అహ్మద్, మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, మాజీ ఉప సర్పంచ్ దిలీప్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



రాజగోపాల్‌పేటలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

నంగునూరు(సిద్దిపేట): ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఎంసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు తొలి రోజు 425 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించిన అధికారులు విద్యార్థులకు ఐడీ, పాస్‌వర్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాటాడుతూ శనివారం నుంచి 10 తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఐడీ పొందిన విద్యార్థులు కళాశాల కోసం ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నితిన్‌పవార్, మాణిక్యం, శ్రీనివాస్, రాజు, సంధ్యారాణి, కవిత, జ్యోతి, విజయ్‌కుమార్, శ్రీనివాస్, రాజమౌళి, స్వామి, శ్యామ్, వాణి పాల్గొన్నారు.

కుక్కలకు రేబీస్ నివారణ టీకా



బెజ్జంకిలో టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా బెజ్జంకి పశువైద్యశాలలో శనివారం పెంపుడు కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు వేశారు. పెంపుడు కుక్కలకు ఏటా రేబీస్ నివారణ టీకా వేయించాలని పశువైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. కుక్క కాటుకు గురైనవాళ్లు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు.

డిగ్రీ కళాశాలలో ..

సిద్దిపేట ఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జూనోసిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జంతు, మత్స్యశాఖ విభాగాధిపతి డాక్టర్ పన్యాల అయోధ్యారెడ్డి మాట్లాడుతూ పెంపుడు జంతువులు, పక్షులతో మానవాళికి విడదీయలేని సంబంధం ఉందని, వాటివల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరమన్నారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా, రేబీస్, ప్లేగు వ్యాధులన్నీ జంతువులు, పక్షిజాతి నుండే వచ్చాయన్నారు. ఎక్కడా నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ యం.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ పుణ్యమ్మ, డాక్టర్ జగదీశ్వరాచారి, జి.వెంకటేశ్, రామ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులతో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పెంపుడు జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి శ్వేత అన్నారు. జగదేవ్‌పూర్ పశువైద్య, పశు సంవర్ధక కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జూనోసిస్ డే పురస్కరించుకుని పెంపుడు కుక్కలకు రేబీస్ నివారణ టీకా వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



సిద్దిపేటలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాబు జగ్జీవన్‌రామ్ అడుగు జాడల్లో సాగుదామని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గజ్వేల్‌లో ..

గజ్వేల్‌రూరల్: బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని దళిత, ప్రజాసంఘాల నాయకులు శనివారం నిర్వహించారు. పట్టణంలోని తూప్రాన్ రోడ్డు మార్గంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉప ప్రధానిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాకటౌన్: బడుగుల అభివృద్ధి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన బాబు జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శమని దుబ్బాక బాబు జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షుడు రాజమల్లు అన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

మాజీ వైస్ ఎంపీపీకి సన్మానం



దేవి రవీందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో పదవీ కాలం పూర్తయిన వైస్ ఎంపీపీ దేవీ రవీందర్‌ను గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారంలో రవీందర్ ముందుండేవారన్నారు.

విద్యార్థినికి సన్మానం



హర్షితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం మంగోల్ హైస్కూల్ విద్యార్థిని హర్షిత బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. శనివారం వర్షితతో పాటు ఆమె తల్లిదండ్రులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు రాంచంద్రం, నాగప్రభాకర్ మాట్లాడారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య అందుతుందన్నారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం గొప్ప విషయమన్నారు. హర్షితను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చదువులో రాణించాలన్నారు.

కారు ఢీ: రెండు గేదెలు మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులోగల రాజీవ్ రహదారిపైన శనివారం తెల్లవారు జామున కరీంనగర్ వెళ్తున్న కారు ఢీకొనడంతో రెండు గేదెలు మృతి చెందగా, మరో గేదెకు గాయాలయ్యాయి. రహదారి సమీప స్మశాన వాటిక వద్ద తోటపల్లి గ్రామానికి చెందిన బొనగం శ్రీనివాస్ తన గేదెలను కట్టిశాడు. వర్షం పడటంతో తాడును తెంచుకొని రోడ్డుపైకి రావడంతో కారు ఢీకొంది. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని, గేదెలను ఢీకొన్న కారు వివరాలను టోల్‌గేట్ వద్ద సేకరించినట్లు బాధితుడు తెలిపాడు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్ రెడ్డి



హుస్నాబాద్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్ రెడ్డి

హుస్నాబాద్: సకాలంలో వర్షాలు కురవాలంటే చెట్లే ఆధారమని, అవి లేకుంటే మానవ మనుగడకే ప్రమాదమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని 8వ వార్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ కోసం ఒక మొక్క నాటాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు మొక్కలు నాటడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్కిరెడ్డి తిరుమల, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తోట స్వరూప, మండల అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు సతీష్, నాగార్జున్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అంతక్కపేట శివారు మల్లన్నగుడి వద్ద డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు.

కుటుంబ సభ్యులతో కలిసి..

కోహెడ(హుస్నాబాద్): భారతీయ జన్ సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని బీజేపీ పిలుపు మేరకు శనివారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం కుటుంబ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప, పార్టీ గ్రామ అధ్యక్షుడు ముంజ సాగర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో పర్యావరణానికి మేలు

గజ్వేల్‌రూరల్: పచ్చదనంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఏక్ పేడ్ మా కే నామ్ ప్రచార ఉద్యమంలో భాగంగా శనివారం పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌బాబు, విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ రామచంద్రం, డాక్టర్ పెద్దిరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ భవాని, అకడమిక్ కోఆర్డినేటర్ బాలరాజు, అధ్యాపకులు డాక్టర్ కవిత, మార్కండేయ, లక్ష్మీనర్సయ్య, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

● వర్గల్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత



వేలూరు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు నమోదుచేస్తున్న వైద్య సిబ్బంది

వర్గల్(గజ్వేల్): పోషక విలువలతో కూడిన ఆహారం ఇస్తే చిన్నారులకు ఆరోగ్యం సిద్ధిస్తుందని, చక్కగా ఎదుగుతారని వర్గల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత పేర్కొన్నారు. శనివారం వర్గల్ మండలం వేలూరు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్‌మేళా నిర్వహించారు. అయిదేళ్లలోపు చిన్నారుల బరువు, ఎత్తు నమోదుచేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరికృష్ణారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు హరిత, నాగమణి, వైద్యసిబ్బంది, తల్లులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

అలిరాజ్‌పేటలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని అలిరాజ్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రోత్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ శ్రీమతి మాట్లాడుతూ పోషకాహారంతోనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. విద్యార్థుల బరువు, ఎత్తులు పరిశీలించి నమోదు చేశారు. కార్యక్రమంలో టీచర్లు సరిత, రేణుక, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మిరుదొడ్డి(దుబ్బాక): సైబర్ నేరాలపై ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధి రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. మహిళల రక్షణ చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్‌టచ్, గంజాయి అనర్థాలు, సీసీ కెమెరాలు, ఈవ్‌టీజింగ్ గురించి వివరించారు. అపరిచితులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఓటీపీ చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పర్శరాములు, హెచ్‌ఎం రవీందర్, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ జీఓను రద్దు చేయాలి



వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్

దుబ్బాకటౌన్: 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను పదవీ విరమణ పేరుతో వారిని ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు నష్టం కల్గించే జీఓ నంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని శనివారం దుబ్బాక సీడీపీఓ చంద్రకళకు వినతి పత్రం అందంజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. వారి సమస్యలను అనేక సార్లు ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ నర్సవ్వ, భూదవ్వ, నర్సవ్వ, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఏఐఎస్‌బీ దుబ్బాక మండల కన్వీనర్ నియామకం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) దుబ్బాక మండల కన్వీనర్‌గా మహ్మద్ సమీర్ సుల్తాన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐఎస్‌బీ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ కొండ ప్రశాంత్ శనివారం జిల్లా కేంద్రంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం కొండ ప్రశాంత్ మాట్లాడుతూ పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏఐఎస్‌బీ పోరాడుతుందన్నారు.

◆ **పంట పెట్టుబడి సహాయం అందజేయాలి**

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం పంట పెట్టుబడి సహాయం అందించకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం దున్నకాలు ప్రారంభం కాగానే రైతుబంధు సహాయం అందజేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు సహాయం పెంచుతామని, వరి పంటకు బోనస్ వేస్తామని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, రామిరెడ్డి, మల్లయ్య, సిద్దు, కిష్టయ్య పాల్గొన్నారు.

◆ **శ్యాంప్రసాద్‌ముఖర్జీకి నివాళి**

బెజ్జంకి(సిద్దిపేట): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతిని బీజేపీ నాయకులు శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు, ప్రధాన కార్యదర్శి అనిల్‌రావు పాల్గొన్నారు.

◆ **లక్కీడ్రా ద్వారా బహుమతులు**

సిద్దిపేటకమాన్: మహిళా ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా చీరలు బహుమతిగా ఇవ్వనున్నట్లు సిద్దిపేట ఆర్టీసీ డీఎం సుఖేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆర్టీసీ సిద్దిపేట డిపో డీలక్స్ బస్సులో రూ.170 చార్జీతో సిద్దిపేట నుంచి జేబీఎస్ వరకు ప్రయాణించిన మహిళా ప్రయాణికులు టికెట్ వెనుక తమ పేరు, వివరాలు, ఫోన్ నంబర్ రాసి లక్కీ డిప్ బాక్స్‌లో వేయాలన్నారు. 15 రోజులకోసారి లక్కీ డిప్ ద్వారా ముగ్గురు మహిళ ప్రయాణికులను ఎంపిక చేసి రూ.వెయ్యి విలువగల చీర బహుమతిగా ఇస్తామన్నారు.

◆ **విద్యారంగ అభివృద్ధికి కృషి**

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సిద్దిపేట ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. శనివారం 20వ వార్డు కౌన్సిలర్ రియాజుద్దీన్ సౌజన్యంతో ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, నాయకులు సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, షాబుద్దీన్, జుబేర్ పాల్గొన్నారు.

◆ **కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి**

నంగునూరు(సిద్దిపేట): అనారోగ్యంతో మరణించిన కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా చొరవ తీసుకుంటామని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ సభ్యుడు ధరిపల్లి చంద్ర అన్నారు. రాంపూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన భవన నిర్మాణ కార్మికుడు గోవిందారం యాదయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

◆ **ప్లాస్టిక్ కవర్‌లను నిషేధించాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ప్లాస్టిక్ కవర్‌లను నిషేధించి, వస్త్రంతో చేసిన సంచులను వినియోగించాలని బెజ్జంకి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్లాస్టిక్ కవర్‌లను వినియోగిస్తే అనారోగ్యానికి గురవుతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరాచారి, ధనలక్ష్మి, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

◆ **రక్తదానం చేసిన కానిస్టేబుల్**

సిద్దిపేటకమాన్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి కానిస్టేబుల్ రక్తదానం చేశాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కూలీ అనారోగ్యంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స సమయంలో అతడికి అత్యవసరంగా రక్తం అవసరం ఉందనే విషయం తెలుసుకున్న టూటౌన్ కానిస్టేబుల్ యాదగిరి ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశాడు.

◆ **ఎంఈఓకు సన్మానం**

కోహెడ(హుస్నాబాద్): మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిగా ఇటీవల బాధ్యతలు చెపట్టిన యాదవరెడ్డిని ఎస్‌టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీధర్, హరిదాస్, శ్రీనివాస్, అబ్దుల్ కరీం, గణేశ్, నరసింహారెడ్డి, చంద్రశేఖర్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.